

# ఎలిజీలు

## – గొల్లపూడి మారుతీరావు



*కౌముది ప్రారంభసంచిక నుంచి క్రమం తప్పకుండా కనిపిస్తున్న పేరు ఆత్మీయ మిత్రులు గొల్లపూడి మారుతిరావు గారు. ఆయన వ్రాసిన ఎన్నో నవలలు, కథలు , వ్యాసాలు, కాలమ్స్ కౌముదిలో వచ్చాయి. ఆనవాయితీ తప్పకుండా వారు వ్రాసిన ఎలిజీలు వ్యాసాలను నెలకొకటి చొప్పున పునర్ముద్రిస్తున్నాము. గొల్లపూడి మారుతిరావుగారు భౌతికంగా మన మధ్యన లేకపోయినా ఆయన అశీస్సులు కౌముదిని సదా వెన్నంటే ఉంటాయి.*

*(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)*

***<u>కాలాన్ని నిలిపిన కవి</u>***



ఉగాది కవి సమ్మేళనాలు ఆకాశవాణి ప్రతిఏడూ జరిపే వార్షికాలు, సాధారణంగా అవి చాలా నేలబారుగా, బోరుగా ఉంటాయి. కవులు వసంత ఋతువునీ, మామిడి పూతనీ, వేప చిగుళ్ళనీ, కోకిలనీ వర్ణించి విసిగిపోయి అదే కవితను పదే పదే చదవడం నాకు తెలుసు. కానీ నేను మద్రాసు కేంద్రంలో పనిచేసే రోజుల్లో ఈ దుర్వాసన లేని, రాని కవి సమ్మేళనాలను కొన్నయినా ప్రసారం చెయ్యగలిగినందుకు గర్వపడుతుంటాను. అలాంటి ఒక కవి సమ్మేళనం రాక్షసనామ సంవత్సరంలో జరిగింది. తెలుగులో లబ్ధ ప్రతిష్టులయిన చాలామంది కవులు మద్రాసులోనే ఉండడం అందులో రహస్యం.

శ్రీశ్రీగారు కూడా అందులో ఒకరు. ఆయనెప్పుడూ ఏ స్వీయకవితా అడిగిన వ్యవధికి ఇవ్వలేదు. కాగా, ఏవో లైన్లు తీసెయ్యడం, ఎప్పుడూ నాకు టైము బాకీ పడడం జరిగేది. "మీకీసారి రెండు నిమిషాలు బాకీ ఎప్పుడో తీర్చుకుంటాను" అని నవ్వుకుంటూ వెళ్ళిపోయేవారు.

ఆ సంవత్సరం ప్రపంచ తెలుగు మహాసభలు జరుగుతున్నాయి. న్యాయంగా శ్రీశ్రీకి ఆహ్వానం వచ్చింది. ముఖ్యమంత్రి దగ్గర్నుంచి. ఆయన ఎందుకు రావడంలేదో విపులంగా ముఖ్యమంత్రిని తిడుతూ రాసిన కవితను కవి సమ్మేళనం రికార్డుంగుకి తెచ్చారు.

"పండుగపూట మీ తిట్లెందుకు, ఏదో జనరల్‌గా వ్రాయకూడదా" అన్నాను. రాస్తానని వెళ్ళిపోయారు. ఆ రాత్రే కాబోలు హైదరాబాద్ వెళ్ళి అక్కడ హోటల్ నుంచి ఉత్తరం రాశారు స్టేషన్ డైరెక్టర్‌కు.

"మీ ఆఫీసర్ నా గేయం అంగీకరించలేదు. నేను మళ్ళీ రాయబోవడంలేదు" అని. మర్నాడు ఉదయం తెలుగు మహాసభల ముందు శ్రీశ్రీ అరెస్టయ్యారు.

ఈ ఉత్తరం, పేపర్లో అరెస్టు వార్త చూచి స్టేషన్ డైరెక్టరుగారు కంగారు పడ్డారు. "ఇలాంటి కవుల్ని పిలిచినందుకు గొడవల్లో పడతావు" అని నన్ను హెచ్చరించారు.

"మద్రాసులో జరిగే కవి సమ్మేళనంలో కాదు. ఎక్కడ తెలుగు కవి సమ్మేళనం జరిగినా శ్రీశ్రీ లేకపోతే అది వ్యర్థం. ఆయన ఈ శతాబ్దపు కవిత్వానికి ఒరవడి దిద్దిన వ్యక్తి" అన్నాను. డైరెక్టరుగారికి ఇది అర్థంకాక "ఏదో నీ ఏడుపు నువ్వేడువు" అని ఊరుకున్నారు. కాంట్రాక్టు రద్దు చేశాను.

మరో వారం రోజులకు అనుకుంటానూ ఒకరోజు ఉదయం నా పడకగదిలో మంచం మీద ఎవరో కూర్చున్నట్టయి లేచాను. శ్రీశ్రీ "గేయం రాస్తానూ డబ్బు కావాలి" అన్నారు.

నాకు కోపం వచ్చి "అయ్యా మీ కవిత్వాన్ని గంటల కొద్దీ నేనే చదవగలను. నలుగురూ ఆనందించే నాలుగు నిమిషాల కవిత్వం చెప్పమంటే నన్ను గొడవ పెట్టేశారు" అన్నాను. గేయం చదవనిదే ఈసారి కాంట్రాక్టు ఇవ్వనన్నాను. పదకొండు గంటలకి వస్తానని వెళ్ళిపోయారు.

విద్వాన్ విశ్వంగారి కవిత రికార్డు చేస్తుంటే వచ్చారు శ్రీశ్రీ గేయం చదివారు. బిత్తరపోయాను. అలా రాసినందుకు ఇబ్బంది పడాలో, అంత గొప్పగా రాసినందుకు గర్వపడాలో అర్థం కాలేదు. విశ్వగారికి ఇచ్చి "దీనిలో ఏది ప్రసారం చెయ్యమంటారు, ఏది మానెయ్యమంటారు" అన్నాను.

శ్రీశ్రీ వేపు తిరిగి "ఎందుకయ్యా ఆయన్ని ఇబ్బంది పెడతావు. ఆ లైన్లు తీసెయ్" అన్నారు.

ముగ్గురు కూచుని ఆ గేయానికి ఒక రాజీకి వచ్చాం. ఆ గేయంలో మొదటి నాలుగు పంక్తులు గుర్తున్నాయి.

"వచ్చావా రాక్షసా రా<br>
తెచ్చావా ద్రాక్ష సారా<br>
రమ్మా నూతన సంవత్సరమ్మా<br>
నువ్వు తెచ్చిందేమిటమ్మా - జిన్నా, రమ్మా"

భాష మీద ఇంత పటుత్వం, ఇంత ఒడుపూ ఉండి, ఇంత పొగరుగా రాయగలిగిన కవులు ఉంటారనుకోను.

శ్రీశ్రీ గారిచేత ఎన్నో కథలూ, నాటికలూ, కవితలు వ్రాయించిన అదృష్టం ప్రసాదించినందుకు ఆ ఉద్యోగాన్ని ప్రేమిస్తాను నేను.

నేను హైస్కూల్లో చదువుకునే రోజుల్లో విశాఖపట్నం గుప్తా బ్రదర్స్ షాపుముందు చదివాను మొదట "మహాప్రస్థానం" అన్న పేరుని. శ్రీశ్రీ - ఏదో విచిత్రంగా ఉందీ పేరు అనుకున్నాను. తర్వాత క్రమంగా ఆయన కవిత, దరిమిలా ఆయనతో పరిచయం.

నేను మాటలు వ్రాసిన మొదటి సినిమా "డాక్టర్ చక్రవర్తి"లో ఆయన పాట రాశారు. "మనసున మనసై" అన్నపాట. అది వ్రాయడానికి ఆఫీసు మెట్లెక్కుతుండగా నేను డైలాగులు చదివి వినిపిస్తున్నాను మధుసూదనరావుగారికి (అన్నపూర్ణా అధినేత) "రామాయణంలో పిడకల వేట" అని చమత్కరించారు. అది విని శ్రీశ్రీగారు "నిద్రాయణంలో

పీడకల వేట" అనండి అన్నారు. అదీ భాషమీద అధికారం ఉన్న మరో కవి చమత్కారం. తీరా నటుల దగ్గరకి వచ్చేసరికి అది పిడకల వేటే అయింది.

శ్రీశ్రీగారితో వ్యక్తిగా నాకు చాలా పరిచయం. ఆయన మహాకవి. సందేహం లేదు. కానీ వ్రాసిన విప్లవం, నడతలో, జీవితంలో పాటించని వ్యక్తి. పాటించాలని రూలు లేదు. తేలికగా అవసరానికి ఆయన్ని మలుచుకోవచ్చును. లేకపోతే ఆయన సినిమా రచయిత అయేవారు కాదు.

ఓసరి సాహిత్య అకాడమీ బహుమతి వచ్చింది. అయిదువేలు రొక్కం. "నేను తీసుకోను. బహుమతిని తిరస్కరిస్తూ ఉత్తరం రాస్తాను" అన్నారు నాతో - ఏదో రికార్డింగుకి రేడియోకి వచ్చి. తీరా ఆయన బహుమతి అందుకున్నారని పేపర్లో చదివాను. వచ్చాక మళ్ళీ కలిశారు.

అడిగాను

"మా ఆవిడకి జబ్బు - డబ్బు సుందర ముదనష్టం" అన్నాడోసారి. ఆఫీసుకు పిలిపించి, టీ సిగరెట్లు తెప్పిస్తే కథ రాసేసేవారు. వెంటనే డబ్బు కావాలి. కాంట్రాక్టు, అగ్రిమెంటు, చెక్కుతో పనిలేదు. ఆనందంగా జేబులోంచి తీసిచ్చేవాడ్ని. తీరా కాంట్రాక్టు గట్రా అయి చెక్కు వచ్చాక మళ్ళీ అది పుచ్చుకునేవారు. ఆనందంగా ఇచ్చేవాడిని. ఓ మహాకవి, రచయిత చేత రచన చేయించిన గర్వం నాది.

"ప్రసారకర్తగా వారు నాకు చాలా టైము బాకీ పడిపోయారు. ఎప్పుడయినా తీరుస్తాను లెండి" అనేవారు. నా బాకీ తీర్చే టైము ఆయనకి ఉంటే మరో గొప్ప కవిత ఈ సాహిత్యానికి మిగిలేది అనుకుంటుంటాను.

ఇజాల కోసం ఆయన్ని చాలామంది భుజాన వేసుకున్నారు కానీ ఇజాలకతీతమైన నిజమైన మహాకవి శ్రీశ్రీ

"ఈ శతాబ్దం నాదం"టూ ఆయన మొహమాటపడ్డారు కానీ తెలుగు సాహిత్యం ఉన్నంతకాలం ఓ కాలానికి మకుటం - ఆయన సంతకం.

*(వచ్చే నెలలో మరో ఎలిజీ)*

Post your comments